కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 50, పచ్చిమిర్చి 70 , బెండ 55, కాకర 40, దొండ 40, దోస 30, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 100.

జేఎన్‌వీ ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆగస్టు 13 ఆఖరు..
డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలో 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష గడువు తేదీని పెంచారు. ఇంగ్లిష్ మీడియంలో రెసిడెన్షియల్ పద్ధతిలో కో ఎడ్యుకేషన్ 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకోవడానికి అవకాశం కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష మెంటల్ అబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్ సబ్జెక్టులపై ఉంటుంది. ప్రస్తుతం అయిదవ తరగతి చదివే వారు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రైవేట్ స్కూళ్ల సంఘం మండల అధ్యక్షుడిగా పవన్‌కుమార్



చందానగర్: శేరిలింగంపల్లి మండలంలో గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ సంఘం సిల్వర్ జూబ్లీ సాధారణ ఎన్నికలు మంగళవారం మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలోని అశోక గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షులుగా ఏఆర్.పవన్‌కుమార్, కార్యదర్శిగా పి.త్రిమూర్తులు, ట్రెజరర్ శ్రీనివాస్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థుల మధ్య పోటీ జరగగా పవన్‌కుమార్‌కు 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు రావడంతో అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్నిక కమిటీ సభ్యులు కె.అనిల్‌కుమార్, బి.నరేంద్ర బాబు, డాక్టర్ బి.వెంకటేశ్వరావు, ఫణికుమార్ నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఘనంగా నాగపంచమి

రాయదుర్గం: నాగపంచమిని పురస్కరించుకుని మంగళవారం ఆలయాల్లో పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు ఖాజాగూడ నాగదేవత దేవాలయం, రాయదుర్గం, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి, మధురానగర్ ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయాలకు వచ్చారు.

గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ కూడలిలో ట్రాఫిక్



సమన్వయంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం



సమస్యను పరిష్కరింపజేస్తున్న జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు

గచ్చిబౌలి: అధికార యంత్రాంగం సమన్వయంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగిపోతున్నాయి. మంగళవారం మాదాపూర్‌లోని బుట్టా కన్వెన్షన్ సెంటర్ సమీపంలో రోడ్డుపై డ్రైనేజీ పారడంతో వాహనాల రాకపోకలు మందగించాయి. దీంతో అధికారులు స్పందించి ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడంతో ట్రాఫిక్ సమస్య తగ్గింది. అదేతరహాలో మైండ్‌స్పేస్ ప్రాంతంలోని ఐకియా–ట్రాన్స్‌కో యూటర్న్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తగా అధికారులు పరిష్కరించారు. ఇక రోడ్డుపై మట్టి, బురద, ఇసుకను తొలగించారు. నిత్యం అధికారులు పర్యవేక్షిస్తే సమస్యలు తీరతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మనూలో ఎఫ్‌డీపీ ప్రారంభం



ఎఫ్‌డీపీ శిక్షణలో పాల్గొన్న వారితో రిజిస్ట్రార్ ప్రొ. ఇష్తియాక్ అహ్మద్ తదితరులు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూజీసీ–ఎంఎంటీటీసీ స్వావలంబన మహిళా వ్యవస్థాపక కార్యక్రమంలో భాగంగా అయిదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)ని మంగళవారం రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థలలో మహిళల నేతృత్వంలో వ్యవస్థాపకతను పెంపొందించే దిశగా అడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐఈఎస్‌బియూడీ) సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ యామిని జైస్వాల్ మాట్లాడారు. ఇతర పైలట్ సంస్థల విజయగాథలను పంచుకున్నారు. ఈ సమావేశంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ, యూజీసీ–ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్‌ఫాతిమా, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మెరాజ్ అహ్మద్, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గురుస్మృతి



మాదాపూర్: శిల్పారామంలో అభినయ వాణి నృత్యానికేతన్ గురువు బాలత్రిపురసుందరి తండ్రి దివంగత డాక్టర్ వెంపటి చినసత్యం వర్ధంతి సందర్భంగా మంగళవారం గురుస్మృతి కూచిపూడి నృత్య నీరాజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌత్వం, వసంత స్వరజతి, నటేశకౌత్వం , దశావతారం తదితర అంశాలను కళాకారులు సౌమ్య, సంయుక్త, శ్రీయ, వెంకట్, ఇషిత, ఐశ్వర్య, సాయి చరణ్, నేత్ర, అలేఖ్య, సంజన తదితరులు ప్రదర్శించారు.

ప్రైవేట్ బస్సులో మంటలు



గచ్చిబౌలి: ఓ ప్రైవేట్ బస్సులో మంటలు రావడంతో సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు మంటలు ఆర్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఉదయం ట్రిపుల్ ఐటీ నుంచి విప్రో సర్కిల్ వైపు వెళుతున్న బస్సు గోపీచంద్ అకాడమీ వద్దకు రాగానే ఇంజన్‌లో నుంచి మంటలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపి, కిందికి దిగాడు. డ్రైవర్ సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఐటీ ఉద్యోగులను కంపెనీ వద్ద వదిలి తిరిగి వస్తుండగా ఘటన చోటు చేసుకుంది.

మహిళ అదృశ్యం



లక్ష్మి (ఫైల్)

మియాపూర్: ఇంటినుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ హఫీజ్‌పేటలోని మార్తాండ నగర్ కాలనీలో నివాసముంటున్న లక్ష్మి(58) ఈ నెల 27వ తేదీ ఉదయం 7.20 గంటలకు కిరాణా షాపునకు వెళ్లింది. రాత్రి అయినా కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకా లభ్యం కాలేదు. దీంతో కుమారుడు నర్సింహ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామని తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

మియాపూర్: ఓ మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మెట్రో స్టేషన్ పిల్లర్ నంబర్–619 సమీపంలో జాతీయ రహదారి పక్కన ఓ మహిళ అపస్మారకస్థితిలో పడి ఉందని సాయంత్రం మియాపూర్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెంది ఉంది. చుట్టుప్రక్కల ఆరాతీయగా అక్కడే భిక్షాటన చేస్తుండేదని స్థానికులు తెలిపారు. మియాపూర్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జేఎన్‌వీలో అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీసీ అభిజిత్‌బెహరా, అధికారులు

రాయదుర్గం: శేరిలింగంపల్లి పరిధి గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా క్యాంపస్‌లో మంగళవారం అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలను నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెహరా ప్రారంభించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఇతర రంగాలలో రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో బాటు శరీర దారుఢ్యానికి సహకరిస్తాయని, ఏకాగ్రతను పెంపొందిస్తాయన్నారు. అంతకుముందు క్రీడాకారులు గౌరవ వందనం చేశారు. క్రీడాపోటీలను ఎన్‌వీఎస్ అధికారులు, జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా అధ్యాపకులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్‌పి బోస్లే, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ రెఫరీల అధ్యక్షుడు గణపతి, జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ విజయభాస్కర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, పాండిచ్చేరి, యానాం ప్రాంతాల జేఎన్‌వీలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: అర్హులందరికి రేషన్ కార్డులు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే నూతన రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మొదటి విడతలో నియోజకవర్గ వ్యాప్తంగా 2,096 మంది లబ్ధిదారులకు కార్డులు అందించామని తెలిపారు. రేషన్ బియ్యాన్ని విక్రయిస్తే శాశ్వత ప్రాతిపదికన రేషన్ కార్డులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వరూప, నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, దశరథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు, ఆయా మండలాల తహసీల్దారులు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన



చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు పునరుద్ధరణ పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయిదమ్మకుంట చెరువు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్ గౌడ్, ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ శ్రీనివాస్, సీఎస్ఆర్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, కాలనీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



మియాపూర్: కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని దత్తసాయినగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.